# సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 27 । జూన్ । 2025






## ప్రణాళిక.. ప్రహసనం

పురపాలికల్లో వందరోజుల యాక్షన్‌ప్లాన్ సరిగా అమలవ్వడం లేదు.

వివరాలు 8లో ▸



## చేయూత.. ఉపాధి

మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు ప్రవేశపెడుతున్నాయి. వివరాలు 8లో ▸



## డంపింగ్ యార్డ్‌కు తాళం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### గురుకులాల్లో జేఎల్ పోస్టుల భర్తీ

జహీరాబాద్ టౌన్: తాత్కాలిక అధ్యాపకుల పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు మొగుడంపల్లి గురుకుల ప్రిన్సిపాల్ హిమబిందు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఈ నెలాఖరు వరకు జిన్నారం గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలని, జూలై 1 తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరుకావాలని చెప్పారు. పీజీలో 55% మార్కులు సాధించి ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9346436829, 98492,37238 నంబర్‌కు సంప్రదించాలని చెప్పారు.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య



విద్యార్థులతో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. సంగారెడ్డి మండలంలోని పసల్వాది గ్రామ శివారులోని ఎంఎన్ఆర్ వైద్య కళాశాలలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మాదకద్రవ్యాల వినియోగం అనారోగ్యాలకు గురి చేయడమే కాకుండా వాటికి బానిసలుగా మారుస్తుందన్నారు. శారీరకంగా, మానసికంగా తీవ్ర సమస్యలకు గురవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సంగారెడ్డి ట్రాఫిక్ సీఐగా రామకృష్ణారెడ్డి



సంగారెడ్డి క్రైమ్ : సంగారెడ్డి ట్రాఫిక్ సీఐగా రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. మల్టీజోన్–2 నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ సుమన్ కొండాపూర్‌కు బదిలీపై వెళ్లారు.

### దివ్యాంగులకు పింఛను ఇవ్వండి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కంగ్టి (నారాయణఖేడ్): అర్హులైన దివ్యాంగులకు పింఛను అందించాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు బి.శ్రీనివాస్ కోరారు. సిర్గాపూర్ ఎంపీడీవో మన్సూర్ నాయక్ గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హులున్నా చాలామందికి పింఛను రావడంలేదన్నారు. 90% వైకల్యం ఉన్న వారికి కూడా పింఛను జారీ చేయడంలేదని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పండరీ, శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

### రాళ్ల ధరలు పెంచడం తగదు


జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంతంలో లభించే ఎర్ర రాళ్ల ధరలు పెంచడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై ఆర్థికభారం పడుతుందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ గురువారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా లభించే ఎర్రరాళ్లతోనే ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం పనులు చేపడతారని చెప్పారు. పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభంకావడంతో వ్యాపారులు రాళ్ల ధరలు ఒక్కసారిగా పెంచారని ఆరోపించారు. రూ.15కు లభించే రాయిని ఒక్కసారిగా రూ.25కు పెంచారని చెప్పారు. రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ ధరకు రాళ్లను ఇప్పించాలని కోరారు.

### విలీన గ్రామాల్లో ఉపాధి కొనసాగించాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మున్సిపల్‌లో విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి ఏఓ సదానందంకు వినతి పత్రం అందజేశారు.

# అటు మోదం.. ఇటు ఖేదం

- టీచర్ల తనిఖీలపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- విద్యలో నాణ్యత పెంపునకు బడుల్లో ఆకస్మిక సందర్శనలు
- అధికారులుగా ఉపాధ్యాయులు
- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



నారాయణఖేడ్: విద్యావ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడుల తనిఖీ కోసం ఉపాధ్యాయుల నియామకం ప్రక్రియపై సర్వత్రా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఈ నెల 25న ఆర్సీ నంబరు 70 ద్వారా ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసేందుకు ఉపాధ్యాయుల నియామకం కోసం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో కూడా త్వరలో బడుల తనిఖీ కోసం ఉపాధ్యాయుల ఎంపిక జరగనుంది. జిల్లాలో మొత్తం ఉపాధ్యాయులు 5,278మంది కాగా, ఎస్‌జీటీలు 2,587మంది ఉన్నారు. ఇటీవల కొత్తగా 415మంది నియామకం అయ్యారు. ఈ లెక్కన ప్రాథమిక పాఠశాలలకు 9 నుంచి 10మంది వరకు, హైస్కూల్స్‌కు 8 నుంచి 10మంది వరకు టీచర్లు తనిఖీ అధికారులుగా నియామకం కానున్నారు. ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేక వైఖరి వ్యక్తం అవుతుండగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి ఉపాధ్యాయులు కాకుండా ఇతర అధికారుల ద్వారా తనిఖీలు జరగాలన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తనిఖీలు తప్పకుండా జరగాలని, కానీ ఉపాధ్యాయులే తనిఖీలు చేస్తే వారు సహ ఉపాధ్యాయులపై చర్యలకు సిఫారసు చేసే అవకాశాలు ఉండవని అంటున్నారు. తనిఖీ అధికారిగా నియామకం అయ్యే ఉపాధ్యాయుడు సదరు పాఠశాలలో ఖాళీ కావడం వల్ల అక్కడి పిల్లలకు అన్యాయం జరిగే అవకాశముంటుందన్న అభిప్రాయాలు సంఘాల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

### నాణ్యతకోసమే తనిఖీలు...

ప్రస్తుతం ప్రతీ మండలంలో ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాఠశాలల పర్యవేక్షణ చేస్తుండగా ప్రత్యేకంగా ఎంపిక చేసి నియమించిన టీచర్లను తనిఖీ అధికారులుగా వ్యవహరించనున్నారు. ఉన్న టీచర్లలో 2% ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియామకం కానున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో రోజుకు కనీసం రెండు పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో రోజుకు ఒక్క పాఠశాలను తనిఖీ చేయాలి. బోధనా పద్ధతులు పెర్ఫార్మెన్స్, రికార్డుల నిర్వహణ, పాఠ్య ప్రణాళిక తయారీని వాడుతున్నారా లేదా?, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ అవుతుందా లేదా?, మూల్యాంకన విధానం జరుగుతున్న తీరు, కో–కరిక్యులర్స్ , పాఠశాల గ్రంథాలయం నిర్వహణ, ఫిజికల్ ఎడ్యుకేషన్, లేబోరేటరీ నిర్వహణ తదితర అంశాలను పాఠశాలల వారీగా క్షుణ్ణంగా పరిశీలించాలి.

### ఉపాధ్యాయ సంఘాల పెదవి విరుపు

పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను ఉపాధ్యాయులకు అప్పగించడం సరికాదని, ఈ ఉత్తర్వులను విరమించుకోవాలని పలు సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఉపాధ్యాయుల తనిఖీ బాధ్యతల్లో ఉండటం వల్ల వారు సేవలందిస్తున్న ఆయా పాఠశాలల్లో బోధన స్తంభించిపోతుందని చెబుతున్నారు.

#### ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ కోసం డిఈఓ, డిప్యూటీ ఇఒ, ఎంఈఒ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను వినియోగించుకోవాలి. అవసరమైన చోట కొన్ని అదనపు పోస్టులను మంజూరు చేయాలి. ప్రత్యేక యంత్రాంగం ద్వారా మాత్రమే పర్యవేక్షణ చేపట్టాలి.

– కంబపురం అశోక్, టీఎస్ యూటీఎఫ్, జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి

#### ఉపాధ్యాయులతో తనిఖీలు సరికాదు



ఉపాధ్యాయులను తనిఖీల పేరుతో పాఠశాలకు దూరం చేస్తే విద్యార్థులు నష్టపోతారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. రెగ్యులర్ ఎంఈఓ పోస్టులను భర్తీ చేసి, పర్యవేక్షణ అధికారులను నియమిస్తే బాగుంటుంది.

– దత్తాత్రి, తపస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి

#### ప్రక్రియ కొనసాగుతుంది



ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలకు ఉపాధ్యాయుల నియామకం ప్రక్రియ నడుస్తుంది. పాఠశాలల సంఖ్యను బట్టి ఎంతమంది అవసరమో గుర్తించి నియమిస్తాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, సంగారెడ్డి

# నిండుకున్న అడుగుమందు

- సహకార సంఘాల్లో అందుబాటులోలేని డీఏపీ
- అడిగినా పంపని మార్క్‌ఫెడ్
- ఈ సంస్థ వద్ద కూడా అడుగంటిన బఫర్‌స్టాక్
- ఇబ్బందులు పడుతున్న రైతులు





సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లాలో ఎరువుల కొరత షురూవైంది. ప్రధానంగా డీఏపీ ఎరువు పూర్తిస్థాయిలో దొరకడం లేదు. రైతుల అవసరాల మేరకు ఈ ఎరువు అందుబాటులో లేదు. పలు మండలాల్లోని సహకార సంఘాల్లో డీఏపీ నిల్వలు అయిపోయాయి. తమకు ఈ ఎరువులు పంపాలని ఆయా సహకార సంఘాలు అడుగుతున్నా...ఈ ఎరువులు అందుబాటులో లేకపోవడంతో నిల్వలు పంపలేకపోతున్నారు. పంటలకు అడుగుమందుగా పేరున్న ఈ ఎరువు ఇప్పుడు పత్తి, సోయా, చెరుకు వంటి పంటలు సాగుకు ఎంతో అవసరం ఉంటుంది. రైతుల అవసరాల మేరకు సహకార సంఘాల్లో ఈ స్టాక్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సంగారెడ్డి, మునిపల్లి, జహీరాబాద్ మండలాల్లో పలు సహకార సంఘాల్లో ఈ డీఏపీ ఎరువు కొరత ఏర్పడింది.

**18 వేల మెట్రిక్ టన్నులు అవసరం**

ఈ వానాకాలం సీజన్‌లో 7.43 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ సీజన్‌కు సుమారు 18 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరమని ఈ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఉన్నతాధికారులకు అవసరమైన ప్రతిపాదనను పంపింది. కానీ, ఇప్పటివరకు సుమారు తొమ్మిది టన్నులు మాత్రమే వచ్చింది. ఇప్పటికే ఈ ఎరువు విక్రయం అయింది. అయితే చాలామంది రైతులు ముందు జాగ్రత్తగా ఈ డీఏపీ ఎరువులను కొనుగోలు చేశారని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా ప్రస్తుతం ఎరువుల నిల్వలు తగ్గాయని చెప్పుకొస్తున్నారు. గతేడాది వానాకాలం సీజన్ మొత్తానికి 16 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ విక్రయం జరిగిందని వ్యవసాయశాఖ అంచనా వేసింది.

**మార్క్‌ఫెడ్ వద్ద కూడా అడుగంటాయి..**

జిల్లాలోని అన్ని సహకార సంఘాలకు, డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రాలకు మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులు సరఫరా అవుతాయి. అయితే ఈ మార్క్‌ఫెడ్‌లోనే డీఏపీ లేదు. వాస్తవానికి మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్‌ను దగ్గర ఉంచుకోవాలి. ఎక్కడైనా ఎరువుల కొరత ఏర్పడితే.. ఈ బఫర్ స్టాక్ నుంచి ఎరువులను విడుదల చేయాలి. కానీ మార్క్‌ఫెడ్ వద్ద ప్రస్తుతం బఫర్ స్టాక్ దేవుడెరుగు..అసలు స్టాకే నిండుకుంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో సరఫరా చేసేందుకు మార్క్‌ఫెడ్‌కు సుమారు 3 వేల మెట్రిక్ టన్నులు అవసమని అధికారులు తెలిపారు. కానీ, ఇప్పటి వరకు కేవలం సుమారు వెయ్యి టన్నులే వచ్చింది. 700 మెట్రిక్ టన్నులు బఫర్ స్టాక్ ఉండాలి. కానీ ఇప్పుడు 200 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉంది. ఈ నిల్వలు ఏ మూలకు సరిపోవు. దీంతో ఈ ఎరువులు అడిగిన సహకార సంఘాలకు డీఏపీ పంపలేకపోతోంది.

**ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో..**

రైతులకు సేవలందించే సహకార సంఘాల్లో డీఏపీ ఎరువులు అందుబాటులో లేకపోగా, ప్రైవేటు డీలర్ల వద్ద మాత్రం ఈ నిల్వలున్నాయి. ప్రస్తుతం 2,400 టన్నులు డీలర్ల వద్ద డీఏపీ ఉందని వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతుండటం గమనార్హం. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు డీలర్లు ఈ ఎరువుల ఎక్కువ ధరలకు విక్రయించే అవకాశాలున్నాయి. దీనిపై వ్యవసాయశాఖ అధికారులు నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే ఈ అరకొర నిల్వలను డీలర్లు బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

### స్టాక్ రావడం లేదు

డీఏపీ ఎరువుల స్టాక్ రావడం లేదు. ప్రస్తుతానికి 200 టన్నుల డీఏపీ ఉంది. ఎమర్జెన్సీ అవసరాల కోసమని ఈ నిల్వలను ఉంచాము. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆదేశాల మేరకే ఈ నిల్వలను సహకార సంఘాలకు పంపుతున్నాం. గతేడాది ఈ ఎరువుల స్టాక్ బాగానే ఉంది. కానీ, ఈసారి అనుకుంత రాకపోవడంతో నిల్వలు తగ్గాయి.

– శ్రీదేవి, మార్క్‌ఫెడ్, డీఎం



మాదక ద్రవ్యాల వినియోగంపై నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య. చిత్రంలో ఎస్పీ పరితోశ్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

యువతకు కలెక్టర్ ప్రావీణ్య పిలుపు

సంగారెడ్డి జోన్: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి సంగారెడ్డి ఐబీ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణ, సీఎంఆర్ డెలివరీ, రేషన్ పంపిణీ, పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు తదితర అంశాలపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అంతర్రాష్ట్ర సరిహద్దు, కీలక ప్రాంతాల్లో చెక్ పోస్టులలో నిఘా విభాగాన్ని అప్రమత్తం చేసి మాదకద్రవ్యాల రవాణా, అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజాపాలన, మీ సేవ ద్వారా అందిన కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల విచారణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 2023–24 రబీ సీజన్ కింద తొమ్మిది మిల్లుల నుంచి సరఫరా కావలసిన సీఎంఆర్ తక్షణమే పూర్తిచేయాలని ఆదేశించారు. సన్న బియ్యం పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు, విద్యాశాఖతో సమన్వయంతో గ్యాస్ కనెక్షన్ల కోసం అవసరమైన డాక్యుమెంటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు లలిత కుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

### శాండ్ బజార్‌కోసం స్థలం పరిశీలన

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక అందజేసేందుకు నిజాంపేట్ మండల కేంద్రంలోని 79 సర్వే నంబరులో శాండ్ బజార్ ఏర్పాటుకు 14 ఎకరాల స్థలాన్ని గృహనిర్మాణశాఖ పీడీ చలపతిరావు, నిజాంపేట్ తహసీల్దార్ నాగజ్యోతి, ఆర్ఐ జాన్సన్, రాష్ట్ర గనుల శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. నిజాంపేట్, కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఇక్కడి నుంచే ఇసుకను అందజేస్తామని చలపతిరావు చెప్పారు. ఖేడ్ మండలం జూకల్ శివారులోని స్థలంలో నిల్వ చేసే ఇసుకను నారాయణఖేడ్, నాగల్‌గిద్ద, మనూరు, కంగ్టి మండలాల లబ్ధిదారులకు అందిస్తామన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

# బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్లు



గుమ్మడిదల కమిషనర్ దశరథ్



గడ్డపోతారం కమిషనర్ వెంకటరామయ్య



బొల్లారం కమిషనర్ కిషన్



జహీరాబాద్ సుభాష్‌రావు

జిన్నారం (పటాన్‌చెరు)/జహీరాబాద్ టౌన్ : ఉమ్మడి జిన్నారం మండలంలోని మున్సిపాలిటీల కమిషనర్లు గురువారం బాధ్యతలు చేపట్టారు. గుమ్మడిదల కమిషనర్‌గా దశరథ్, గడ్డపోతారం–వెంకటరామయ్య, బొల్లారం– కిషన్, జహీరాబాద్–దేశ్‌ముఖ్ సుభాష్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్లకు సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఆయా పట్టణాలకు చెందిన స్థానిక నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు బ్యాగుల వితరణ

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఓడీఎఫ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఆధ్వర్యంలో బ్యాగులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్స్ చైర్మన్ సయ్యద్ ఇమామ్ మాట్లాడుతూ..పేద విద్యార్థులకు చదువుకునేందుకు సహకారం అందించాలనే ఉద్దేశంతో బ్యాగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల విద్యాభివృద్ధి అధికారి జోగప్ప మాట్లాడుతూ..విద్యాభివృద్ధి కోసం సహకారం అందిస్తున్న సంస్థ చైర్మన్‌ను అభినందించారు.



విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న గ్రేటర్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ చైర్మన్ సయ్యద్ ఇమామ్

# సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

ముత్తంగి పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడంతోపాటు..నాణ్యమైన విద్యను అందిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి దత్తాత్రేయనగర్ కాలనీలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో రూ.2.50కోట్ల నిధులతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నేటి తరం తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నెలకొన్న అభిప్రాయాన్ని మార్చుకోవాల్సిన పరిస్థితులు కల్పించామన్నారు. నియోజకవర్గంలో నూతన పాఠశాలల భవన నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్న గ్లాండ్ ఫార్మా పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పటాన్‌చెరు నియోజకవర్గానికి నూతనంగా మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాల నిర్మాణం కోసం భూమి కేటాయించాలని కలెక్టర్ ప్రావీణ్యను ఎమ్మెల్యే గూడెం కోరారు. కార్యక్రమంలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సీఎస్ఆర్ హెడ్ రఘురామన్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్ లేకుంటే సీజ్

విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా రవాణాశాఖ అధికారులు బడి బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టారు. కొన్ని రోజుల నుంచి బస్సుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రవాణాశాఖ నిబంధనలు, డ్రైవర్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బస్సుల ఫిట్‌నెస్ తదితర అంశాలపై బుధవారం జహీరాబాద్ ఎంవీఐ ఎం.వెంకటయ్య 'సాక్షి'తో మాట్లాడారు.

### టాక్స్ చెల్లించకుంటే జరిమాన

- 200 బస్సులకు సామర్థ్య పరీక్షలు
- జహీరాబాద్ ఎంవీఐ వెంకటయ్య



ఎం.వెంకటయ్య, ఎంవీఐ, జహీరాబాద్

జహీరాబాద్ టౌన్:

**సాక్షి: జహీరాబాద్ డివిజన్ పరిధిలో ఎన్ని స్కూల్ బస్సులు ఉన్నాయి. బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయా?**

ఎంవీఐ: జహీరాబాద్ డివిజన్ పరిధిలో జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాలు వస్తాయి. డివిజన్ వ్యాప్తంగా 218 ప్రైవేట్ స్కూల్ బస్సులున్నాయి. ఇప్పటి వరకు 200 బస్సులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించాం. మిగిలిన బస్సులకు కూడా పరీక్షలు నిర్వహిస్తున్నాం.

**సాక్షి: బస్సుల ఫిట్‌నెస్ సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు ఏంటి?**

ఎంవీఐ: బస్సు పూర్తిగా కండిషన్‌లో ఉండాలి. బస్సు టైర్లు, బ్రేకులు, సీట్లు, ఫుట్ బోర్డు, ఫస్ట్ ఎయిడ్ కిట్, పాఠశాల రిజిస్ట్రేషన్ తదితర అంశాలను పరిశీలిస్తాం. బస్సుపై పాఠశాల పేరు, సెల్‌ఫోన్ నంబర్ కచ్చితంగా ఉండాలి. నిబంధనలు పాటించకుంటే బస్సులకు అనుమతులు ఇవ్వం.

**సాక్షి: నిబంధనలు పాటించకుంటే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**

ఎంవీఐ: నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేస్తాం. ఫిట్‌నెస్‌తోపాటు టాక్స్ కట్టని బస్సులకు రూ.5 వేల వరకు జరిమాన విధిస్తాం.

**సాక్షి: ఆటోల్లో పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లవచ్చా?**

ఎంవీఐ: నిబంధన ప్రకారం ఆటోలో విద్యార్థులను తీసుకెళ్లకూడదు. తప్పని పరిస్థితుల్లో మాత్రమే సామర్థ్యం మేరకు పిల్లలను కూర్చోబెట్టాలి. స్కూల్ ట్రిప్ అని ముందు వెనుక రాయాలి. నిబంధనలు పాటించకుండా నడిపితే కేసులు పెడతాం.

**సాక్షి: డ్రైవర్లు ఎలాంటి నిబంధనలు పాటించాలి?**

ఎంవీఐ: డ్రైవర్‌కు కనీసం 5 ఏళ్ల అనుభవం ఉండాలి. వయసు 60 సంవత్సరాల లోపు ఉండాలి. తప్పనిసరి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. డ్రైవర్‌కు కచ్చితంగా సహాయకుడు ఉండాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.

## క్లుప్తంగా

### గాయపడ్డ నెమలికి చికిత్స



నెమలిని అటవీ సిబ్బందికి అప్పగిస్తున్న రైతు

**శివ్వంపేట(నర్సాపూర్):** గాయపడిన నెమలికి అటవీ సిబ్బంది చికిత్స చేయించారు. గురువారం మండల పరిధిలోని గోమారం గ్రామ శివారులో వెంకట్‌రెడ్డికి చెందిన పౌల్ట్రీ పామ్ వద్ద ఓ నెమలి గాయపడి ఉండగా గుర్తించిన రైతు అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. శివ్వంపేట ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీధర్‌కుమార్, బీట్ అధికారి శ్రీవల్లి గాయపడిన నెమలిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నెమలికి నర్సాపూర్‌లో పశు వైద్యశాలలో చికిత్స చేయించి అడవిలో వదిలిపెట్టారు.

### పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**గజ్వేల్‌రూరల్:** పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన మాదగారి రేగొండకు భార్య మంజులతో పాటు కొడుకు, కూతురు ఉన్నారు. తమకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజు మాదిరిగానే భార్యాభర్తలు వ్యవసాయ పొలానికి వెళ్లారు. మంజుల పొలంలో పనిచేస్తుండగా, రేగొండ సమీపంలోని చింతచెట్టుకింద పడుకున్నాడు. మంజుల కొద్దిసేపటి తర్వాత రేగొండ వద్దకు వెళ్లి చూడగా పక్కనే పురుగుల మందు డబ్బా కనిపించింది. అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

### సామాజిక చైతన్య స్ఫూర్తి కల్పిస్తాం

**సిద్దిపేటజోన్:** తెలంగాణ ప్రాంతంలో నెలకొన్న అనేక సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్య స్ఫూర్తి కలిగించేలా ఇండస్ట్రీ ముందుకు సాగనుందని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఆడిటోరియంలో ఇండస్ట్రీ ఆవిర్భావ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జులై నెలాఖరులో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డ్రగ్స్, గంజాయి, అదనపు వరకట్నం వేధింపులు, మహిళలపై దాడులతోపాటు ప్రజల్లో అవగాహన లేక జరుగుతున్న అనేక అంశాలను క్రోడీకరించి త్వరలో సిద్దిపేటలో భారీ ప్రదర్శన చేపట్టనున్నట్టు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి సత్తార్, ఇన్‌చార్జి రాజేష్ మాట్లాడుతూ.. మరొక సామాజిక ఉద్యమానికి ఇండస్ట్రీ నాంది పలికిందన్నారు.కార్యక్రమంలో ప్రతినిధులు తేలు విజయ, రమేష్,నర్సింహులు, జెఎల్ నాందేవ్, గణేష్, శంకర్ బాబు, శాంతిరాజ్ పాల్గొన్నారు.

### పేకాట రాయుళ్ల అరెస్ట్

**మెదక్ మున్సిపాలిటీ:** పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజారెడ్డి వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 మొబైల్స్, రూ. 8,765 నగదు ను స్వాధీనం చేసుకుని మెదక్ టౌన్ ఎస్ఐకి అప్పగించారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు దాడి చేసినట్లు తెలిపారు.

**తూప్రాన్‌లో..**

**తూప్రాన్:** పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రంగాకృష్ణ వివరాల ప్రకారం... అల్లాపూర్ సమీపంలో ఓ వెంచర్‌లో పేకాటాడుతున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10700, మూడు బైకులు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

# ప్రణాళిక.. ప్రహసనం

## కానరాని కార్యాచరణ - ఎక్కడి చెత్త అక్కడే

- మున్సిపాలిటీల్లో తాండవం చేస్తున్న సమస్యలు
- విఫలమైన అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పురపాలికల్లో వందరోజుల ప్రణాళిక సరిగా అమలవ్వడం లేదు. వెరసి మురుగునీటి కాలువల అపరిశుభ్రత, చెత్త తరలింపులో నిర్లక్ష్యం, మురుగు గుంతలు, దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు, తదితర పనులు చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. అధికారులు పకడ్బందీ ప్రణాళికతో మున్సిపాలిటీల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**జోగిపేట(అందోల్):** పట్టణంలోని భరత్ నగర్ కాలనీకి వెళ్లే దారిలో గల పార్కు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ పార్కు మున్సిపల్ కార్యాలయం ప్రక్కనే ఉండటం గమనార్హం. గాంధీ పార్కుకు తాళం వేయడం వల్ల అందులో చెత్త పేరుకుపోయింది. జోగిపేట-అన్నాసాగర్ వెళ్లే రహదారి ప్రక్కనే చెత్త పేరుకుపోయింది. వంద రోజుల ప్రణాళిక తూతూ మంత్రంగా నిర్వహించారని పలువురు ఆరోపిస్తున్నారు. 20 వార్డులను టార్గెట్ చేసి పనులు చేపట్టినా పారిశుధ్యం, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు.

### ప్రణాళిక అమలేది?



మురుగుతో నిండి చెరువులో పెరిగిన గుర్రపు డెక్క

**మెదక్ మున్సిపాలిటీ:** మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక ముందుకు సాగడం లేదు. అక్కడక్కడ మొక్కుబడి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అనంతరం వీధుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. పట్టణంలోని చెరువులు, ఎంఎన్ కెనాల్‌లో పారిశుద్ధ్య లోపంతో కంపుకొడుతున్నాయి. మల్లం చెరువు కట్టపై చెత్త పేరుకుపోయింది. ఎంఎన్ కెనాల్‌లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలు, చెత్తతో నిండిపోయి కంపు కొడుతోంది. కాలనీల్లోని మురుగు కాల్వలు సైతం ఇదే పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



జోగిపేట(అందోల్): రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

### అవగాహన కల్పిస్తే.. ఇలా చేస్తారా?



రోడ్డు పక్కన తగులబెడుతున్న చెత్త

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నామమాత్రంగా ప్రణాళిక నిర్వహిస్తున్నారు. మొత్తం యాక్షన్‌ప్లాన్‌లో 50 అంశాల్లో పారిశుద్ధ్యం ఒకటి. తడి, పొడి చెత్తపై మాత్రం అవగాహన కూడా కల్పించడం లేదు. పలుచోట్ల చెత్తను బహిరంగంగా తగలబెడుతున్నారు. పారిశుద్ధ్యంపై కాలనీలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కానీ మున్సిపల్ పరిధిలో అమలు కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూం కాలనీ వద్ద అధ్వానంగా చెత్తకుప్పలు



దుబ్బాకలో టీటీడీ కల్యాణమండపం సమీపంలో దర్శనమిస్తున్న చెత్త

### పారిశుధ్య పనుల్లో నిర్వహణ లోపం..

**దుబ్బాక:** మున్సిపాలిటీలోని 20 వార్డులలో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం డ్రైనేజీ శుభ్రం చేసే పనులు కూడా సరిగా చేయడం లేదు. వార్డులలో ప్రజలకు తడి,పొడి చెత్త, వానాకాలంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రూ.20 కోట్ల నిధులు వస్తే సమస్యలు తీరుతాయని, అవి లేకే సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా ఉన్న సమస్యలు అధికారులు నోట్‌పై చేసుకుంటున్నప్పటికీ అవి ఎంత వరకు పరిష్కారం అవుతాయో.. చూడాలని ప్రజలు వాపోతున్నారు.

### వృద్ధి చెందుతున్న దోమలు



పిల్లల పార్కులోని భగీరథ ట్యాంకు వద్ద వాల్వుల చుట్టూ నిలిచిన మురుగు

**నర్సాపూర్:** మున్సిపాలిటీలో మురికి కాలువల శుభ్రం, పిచ్చి మొక్కలు తొలగింపు, భగీరథ పథకం నీటి ట్యాంకుల క్లోరినేషన్ చేయడం తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ ఆ పనులను సక్రమంగా చేపట్టక పోవడం గమనార్హం. పిల్లల పార్కులోని మిషన్ భగీరథ ట్యాంకు నీరు లీకవుతుంది. వాల్వుల వద్ద మురికి కూపంగా తయారైంది. సునీతారెడ్డి కాలనీలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో మురికి నీరు నేలపై పారి పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో దోమలు పెరగుతున్నాయని కాలనీ వాసులు చెప్పారు

### స్కూల్ బకాయి ఫీజులు చెల్లించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

**గజ్వేల్‌రూరల్:** బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఫీజు బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకం కింద డే స్కాలర్, రెసిడెన్షియల్‌లో జిల్లాలోని ఎనిమిది ప్రైవేటు పాఠశాలల్లో 578 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు తెలిపారు. మూడేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు తల్లిదండ్రులను వేధిస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న రూ.3కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, జిల్లా అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి తిరుపతి పాల్గొన్నారు.

### దేవాలయంలో నగల అపహరణ

**కొండపాక(గజ్వేల్):** దుర్గమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. సుమారు 20 వేల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలతో పాటు అమ్మవారి చీరను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన త్రీటౌన్ పోలీస్టేషన్ పరిధిలోని రాంపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... గ్రామంలో ఉన్న అమ్మవారి దేవాలయంలో ధూప, దీప నేవేద్యాల సమర్పణ అనంతరం బుధవారం రాత్రి మూసివేశారు. గురువారం ఆలయ దర్వాజ తెరిచి ఉండటం చూసిన వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. వెళ్లి చూడగా బంగారు, వెండి ఆభరణాలతో పాటు చీరను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో పాటు దేవాలయం ఆవరణలో, సమీపంలోని కొందరి ఇండ్ల వద్ద వండిన అన్నం చల్లారు. ఈ విషయమై త్రీటౌన్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

# చేపల కోసం వెళ్లి.. స్తంభాన్ని ఢీకొట్టి

### రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



సార్ల రాంచరణ్

**కొమురవెల్లి(సిద్దిపేట):** రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రం శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సార్ల రామ్‌చరణ్(16) అదే గ్రామంలో 10 వతరగతి చదువుతున్నాడు. గ్రామానికి చెందిన ఆంజనేయులుతో కలిసి కొమురవెల్లి చెరువులో చేపలు పట్టడానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. చెరువులో చేపలు పడకపోవడంతో తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో కొమురవెల్లి నుంచి తిమ్మారెడ్డిపల్లి వెళ్లే రోడ్డులో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనాన్ని తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ద్విచక్రవాహనం నడుపుతున్న రామ్‌చరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని..



వినోద్ కుమార్

**కంది(సంగారెడ్డి):** వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ కథనం ప్రకారం... కందికి చెందిన కోస్కే వినోద్ కుమార్ గౌడ్(22) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి కందిలో దాబాకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో పటాన్ చెరు వైపు నుంచి సంగారెడ్డికి వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్ కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

### ప్రమాదవశాత్తు కింద పడి కార్మికుడు..

**పటాన్‌చెరు టౌన్:** ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నేపాల్‌కు చెందిన మూసారహు సాదే (55) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం వచ్చి పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఓ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి వాష్ రూమ్‌కి వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు కిందపడి తలకి గాయమైంది. తోటి కార్మికులకు చెప్పగా ఇస్నాపూర్‌లో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం పటాన్ చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



మూసారహు సాదే

### మంగోల్‌లో గుర్తు తెలియని మృతదేహం

**కొండపాక(గజ్వేల్):** గుర్తు తెలియని వృద్దుడి మృతదేహం మండలంలోని మంగోల్ గ్రామంలో కనిపించింది. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం... గ్రామంలో 15 రోజులుగా గుర్తు తెలియని వృద్దుడు భిక్షాటన చేస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి బస్టాప్ వద్ద పడుకొని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు.

# చెరువులో పడి వృద్ధురాలి మృతి

- కుమారులు సరిగా చూడటం లేదనా..
- అనారోగ్య సమస్యతో ఆత్మహత్యనా?



పూదరి కనకవ్వ

**అక్కన్నపేట(హుస్నాబాద్):** చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన గురువారం సాయంత్రం మండలంలోని అంతక్కపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పూదరి కనకవ్వ(70)కు నలుగురు కుమారులు ఉన్నారు. అందులో ఒక కుమారుడు కరీంనగర్‌లో ఉంటున్నాడు. మిగిలిన కుమారుల వద్ద ఆమె ఉంటుంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా కుమారులు సరిగా పట్టించుకోకపోవడంతో పాటు అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. అనార్యోగ సమస్య తట్టుకోలేకనా ? లేక కుమారులు సరిగా చూడటం లేదని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టానికి తరలించారు. వృద్ధురాలి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై సాక్షి ఎస్ఐ విజయ్‌భాస్కర్‌ను సంప్రందించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

### మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**కౌడిపల్లి(నర్సాపూర్):** వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తునికిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎతిరాజుల సుశీలకు ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా చిన్న కొడుకు యాదగిరి(32) తునికిలో తల్లి వద్ద ఉంటున్నాడు. మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. తల్లి కూలీపనులు చేస్తూ పోషిస్తుంది. పలుమార్లు మద్యం సేవించి తల్లితో సైతం గొడవపడేవాడు. గురువారం తల్లి గ్రామంలోకి వెళ్లొచ్చేసరికి ఇంట్లో యాదగిరి ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య పదేళ్లక్రితం చనిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇళ్లు కూలగొట్టి రోడ్డున పడేశారు

- పెట్రోలు డబ్బాతో దివ్యాంగుడి ఆందోళన
- డబుల్ బెడ్రూం నుంచి వెళ్లిపోవాలని లబ్ధిదారుల ఒత్తిడి



అంబేడ్కర్ చౌరస్తా వద్ద పెట్రోల్ డబ్బాతో ఆందోళనకు దిగిన దివ్యాంగుడు నాగరాజు

**గజ్వేల్‌రూరల్:** రోడ్డు వెడల్పులో తమ ఇండ్లను తొలగించిన గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోకుండా తాత్కాలికంగా డబుల్ బెడ్రూంలను కేటాయించి చేతులు దులుపుకున్నదని బాధితులు పేర్కొన్నారు. పెట్రోల్ డబ్బా పట్టుకొని ఆత్మహత్యే శరణ్యమంటూ ఓ దివ్యాంగుడు ఆందోళనకు దిగాడు. ఈ ఘటన గజ్వేల్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం... గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారంలో రోడ్డు వెడల్పులో భాగంగా గత ప్రభుత్వ పాలనలో 19 మందికి చెందిన ఇళ్లను తొలగించేందుకు అధికారులు సిద్ధమవగా, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి బాధితులకు నచ్చజెప్పి సంగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూంలలోకి పంపించారు. అక్కడ మొదటి అంతస్తులో ఇళ్లు కేటాయించారు. కానీ, దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి మార్చాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా 9 మంది బాధితులకు ఉండేందుకు అనుమతించారు. కాగా డబుల్ లబ్దిదారులు వచ్చి ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బాధిత దివ్యాంగుడు నాగరాజు పెట్రోల్ డబ్బా, అగ్గిపెట్టెను చేతిలో పట్టుకొని ఆందోళనకు దిగాడు. సమాచారం తెలుసుకున్న సీఐ సైదా ఘటనా స్థలానికి వెళ్లి నచ్చజెప్పారు. బాధితులందరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాగరాజు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో తమ ఇండ్లను తొలగించారని, ప్రస్తుత ప్రభుత్వం ఆదుకొని గూడు కల్పించాలని కోరాడు.

# లోన్ ఇప్పిస్తానని డబ్బులు వసూలు

### సైబర్ నేరస్తుడి అరెస్ట్





వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను, ఎస్ఐ నీరేష్

**చేర్యాల(సిద్దిపేట):** లోన్ ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసిన సైబర్ నేరస్తుడిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ పి.నీరేష్ కేసు వివరాలు వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లా ఊరుగొండ మండలానికి చెందిన పిల్లెల శ్రీకాంత్ తెలంగాణ రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం పేరిట వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాడు. పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అందులో చేరేలాగా చేసిన శ్రీకాంత్ జాతీయ రియల్ ఎస్టేట్ సంఘం నుంచి రుణాలు వస్తాయని, అందుకు సభ్యత్వ రుసుము రూ. 25 వేలు చెల్లించాలని గ్రూపులో పోస్ట్ చేశాడు. ఇది నిజమేనని నమ్మిన మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకు లోన్ కావాలని వాట్సాప్‌లో అడిగాడు. వెంటనే అతనికి ఫోన్ చేసి సభ్యత్వ రుసుము రూ.25వేలు పంపించాలని శ్రీకాంత్ కోరాడు. సదరు వ్యక్తి గూగుల్‌పే ద్వారా రూ.25 వేలు రెండు విడతల్లో పంపించాడు. ఫోన్‌చేస్తే ఎత్తకపోవడంతో మోసపోయానని గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నేరస్తుడిని అరెస్టు చేశారు.

# చేయూత.. ఉపాధి

## మహిళలకు స్త్రీ నిధి ద్వారా రూ.83 కోట్ల రుణాలు

- డిజిటల్ పద్ధతిలో నెలవారీగా చెల్లింపులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- వివిధ రంగాల్లో ఉపాధి పొందుతున్న అతివలు

**సంగారెడ్డి టౌన్:** మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలు ప్రవేశపెడుతున్నాయి. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వారికి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు వివిధ ఉపాధి అవకాశాలు లభించేలా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నారు. మహిళలకు కిరాణా దుకాణాలు, టెంట్ హౌస్, కోళ్ల పరిశ్రమ, డెయిరీ పామ్, వివిధ చిన్న తరహా వ్యాపారాలను ఏర్పాటు చేసుకొని మహిళా సంఘాల ద్వారా లబ్ధి పొందుతూ జీవనోపాధి పొందుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో స్త్రీనిధి ద్వారా ఈ సంవత్సరంలో రూ.83 కోట్ల రుణాలు మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. జిల్లాలో 25 మండలాలు, 365 గ్రామ సంఘాల్లో 10,016 మంది సభ్యులకు స్త్రీ నిధి బ్యాంకు ద్వారా రుణాలిచ్చారు. స్త్రీ నిధి నుంచి రుణాలు పొంది స్వయం ఉపాధి పొందడంతో పాటు ప్రత్యక్షంగా పరోక్షంగా మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నారు. సభ్యులు తీసుకున్న రుణాలకు ప్రతి నెల ఆన్‌లైన్‌లో నేరుగా చెల్లించే అవకాశం కల్పించడంతోపాటు సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు.



డిజిటల్ పద్ధతిలో డబ్బులను చెల్లించిన మహిళా సంఘం సభ్యులు

### మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘంలోని సభ్యులకు స్త్రీ నిధి ద్వారా రుణాలిస్తూ వ్యాపారాలు చేయడానికి ప్రోత్సహిస్తున్నాం. తీసుకున్న డబ్బులను ప్రతి నెల ఆన్‌లైన్‌లో సకాలంలో చెల్లిస్తున్నారు. మహిళలకు మరింత అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాం. వంద శాతం రుణాలు అందజేశాం.

- శ్రీనాథ్, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్

### ఫ్యాన్సీ స్టోర్ నడుపుతున్న



స్త్రీ నిధి ద్వారా మూడు లక్షల రుణం తీసుకున్న. ఆ డబ్బుతో ఫ్యాన్సీ స్టోర్ దుకాణం ఏర్పాటు చేసిన. తీసుకున్న రుణాన్ని ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాను. అలాగే పొదుపులో కూడా ప్రతి నెలా డబ్బులు కడుతున్నాం. ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు స్త్రీనిధి ఉపయోగపడుతుంది.

- సరస్వతి, తాలేల్మా గ్రామం, అందోల్

### శుభకార్యాలకు డెకరేషన్



స్త్రీ నిధి ద్వారా రుణం తీసుకున్న. ఈ డబ్బులతో వివాహాలకు సంబంధించిన డెకరేషన్ వస్తువులను కొనుగోలు చేశా. వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్నా. శుభకార్యాలకు డెకరేషన్ నిర్వహిస్తూ మంచి ఆదాయం పొందుతున్న.

- పద్మ, దేవుని గ్రామం, వట్టిపల్లి

### మంచి అవకాశాలు



మహిళా సంఘాల్లోని సభ్యులకు మంచి అవకాశాలు ఉన్నాయి. స్త్రీ నిధి ద్వారా మూడు లక్షలు రుణం తీసుకొని సొంతంగా టెంట్ హౌస్‌ను నడుపుతున్న. గ్రామంలోనే ఉంటూ వివాహాది శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలకు సామాన్లు ఇస్తూ మంచి ఆదాయం ఆర్జిస్తున్నాను.

- లక్ష్మి, ఇస్మాయిల్ ఖాన్‌పేట్, సంగారెడ్డి